Advertorial

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 22-8-2024
సంపుటి: 20 సంచిక: 128
పేజీలు: 4 వెల: రూ.1





## దాతృత్వ ధీరుడు..
# సామాజిక వైద్యుడు

- ఆపన్నులను అక్కున చేర్చుకునే ఆత్మీయుడు
- సేవా కార్యక్రమాలకే ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు
- విద్య, వైద్య, క్రీడా, ఆధ్యాత్మిక రంగాలకు భూరి విరాళాలు
- సామాన్య కుటుంబం నుంచి వచ్చి అసామాన్య సేవలు

ఎదుర్కొన్న కష్టాలు ఆయనలోని కారుణ్య గుణాన్ని తట్టిలేపాయి. సామాన్యుడిగా పెరిగిన వాతావరణం ఆయనలో సేవాభావాన్ని పెంపొందించింది. తన కుటుంబంలా మరో కుటుంబం కష్టాలు కన్నీళ్లతో కుంగిపోరాదన్న భావన ఆయన్ను సేవాధనుడిగా రాటుదేల్చింది. వయసుతో పాటు వధాన్యత కూడా పెరుగుతూ వచ్చింది. ఫలతంగా దాతృత్వం అనే సుగుణం పేవా పరిమళాలు వెదజల్లడం ప్రారంభించింది. ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిస్తే తక్షణమే వారి ముంగిట వాలిపోయి చేతనైనా సాయం ఇచ్చి చెయ్యి పట్టి నిలబెడతారు. ఆయన వద్దకు వెళ్లే వారెవరూ నిరాశ చెందరు. ఉత్త చేతులతో వెనుదిరిగే ప్రసక్తే ఉండదు. అందుకే.. పేదలకు ఆయనే ఒక సంతోషం. అన్నార్తులకు ఆయనే అన్నదాత. మసకబారిన జీవితాలకు ఆయనే వెలుగు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయనే ఆధారం.. పేద రోగులకు ఆయనే ఒక ఆలంబన. క్రీడాకారులకు ఆయనే మార్గదర్శి. అలా సమాజంలో దాదాపు అన్ని వర్గాలతోనూ సేవాబంధం పెనవేసుకున్నందునే సూర శ్రీనివాసరావు సామాజిక వైద్యుడయ్యారు. ప్రముఖ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకుని డాక్టర్ సూర శ్రీనివాసరావు అయ్యారు. పేదల ఇంట శుభకార్యం జరగాలన్నా.. ఒక దేవాలయం జీర్ణోద్ధరణ జరగాలన్నా.. ఒక పేద రోగికి స్వస్థత చేకూరాలన్నా శ్రీనివాసరావు ఒక చెయ్యి వేయాల్సిందే. తన స్వగ్రామమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు శ్రీకాకుళం నగరంలోనూ ఎందరో ఆపన్నులను అక్కున చేర్చుకుంటూ.. భూరి విరాళాలు ఇస్తూ.. సేవ కార్యక్రమాలతో వ్యాపారవేత్తగా కంటే సామాజికవేత్తగానే ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.



(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

కిందిస్థాయి నుంచి ఎదిగి ఉన్నత స్థానాలకు చేరుకున్నవారు చాలామందే కనిపిస్తారు. అలా ఎదిగినవారిలో చాలామంది తమ గతాన్ని, తమ గ్రామాన్ని, తమ స్నేహితులు, సన్నిహితులను సైతం మర్చిపోతుంటారు. హోదా, దర్పం ప్రదర్శించేవారే ఎక్కువ. కానీ ఎంత సంపాదించినా, ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా కన్నతల్లిని, ఉన్న ఊరిని, తను పెరిగిన సమాజాన్ని మర్చిపోకుండా ఏదో చేయాలని తపించేవారు కొద్దిమందే ఉంటారు. అటువంటి వారిలో సూర శ్రీనివాసరావు ముందుంటారు. పెద్ద కుటుంబంలో ఆర్థిక ఇబ్బందుల మధ్య పెరిగిన ఆయన ఆ కష్టాలనే తన ఎదుగుదలకు మెట్లుగా మలచుకున్నారు. భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు. వ్యాపార రంగంలో కాలు మోపి కృషి, పట్టుదలతో విజయం సాధించి ఉన్నత స్థితికి చేరారు. సంపాదనలో కొంత దీనజనోద్ధరణకు కేటాయిస్తూ శ్రీమంతుడిలా పని చేస్తున్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామంలో జన్మించిన శ్రీనివాసరావు తల్లిదండ్రులు గన్నయ్య, వైకుంఠమ్మలు. చాలా పెద్ద కుటుంబం. ఆ దంపతులది బహుసంతానం. మొత్తం ఏడుగురు పిల్లల్లో ఐదో సంతానమే సూర శ్రీనివాసరావు. ముగ్గురు అన్నదమ్ములు, నలుగురు అక్కచెల్లెళ్లు. ఇంత పెద్ద కుటుంబానికి వ్యవసాయమే జీవనాధారం. ఫలితంగా ఆర్థిక ఇబ్బందులతో సావాసం చేస్తూనే శ్రీనివాసరావు పెరిగారు. తల్లిదండ్రులు చదివించాలనుకున్నా పెద్దగా ఆసక్తి లేకపోవడంతో చదువుకు స్వస్తి చెప్పి వ్యాపారరంగం వైపు దృష్టి సారించారు. చిరు వ్యాపారిగా మొదటి అడుగు వేసిన శ్రీనివాసరావు క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేసి ఆ రంగంలో నిలదొక్కుకున్నారు. ఒక్కో మెట్టూ ఎక్కుతూ క్రమంగా ఉన్నత స్థానానికి చేరుకున్నారు. కానీ తన నేపథ్యాన్ని ఎన్నడూ మర్చిపోలేదు. సమాజానికి, తన చుట్టూ ఉన్న పేదలకు ఏదో చేయాలన్న సంకల్పం నుంచి పక్కకు తప్పుకోలేదు. వ్యాపారంలో తాను సంపాదించిన దాంతో కొంత సమాజానికి కేటాయించి సేవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆ సేవలే ఆయన్ను సేవాసంపన్నుడిగా నిలబెట్టాయి. ఈయన సేవలకు గుర్తింపుగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక ప్రముఖ విద్యాసంస్థ డాక్టరేట్‌తో సత్కరించింది.



### సేవలకే ఒక ట్రస్ట్

ఏ పని చేసినా దాన్ని ప్రణాళికాబద్ధంగా, నిబద్ధతతో చేపట్టాలి. అప్పుడే దాని విలువ పెరుగుతుంది. దాని లక్ష్యం నెరవేరుతుంది. ఈ ఉద్దేశంతోనే తాను చేపడుతున్న సేవా కార్యక్రమాలన్నీ ఒకే గొడుగు కింద సక్రమంగా జరగాలన్న లక్ష్యంతో శ్రీనివాసరావు తన పేరుతోనే నాలుగేళ్ల క్రితం తన పుట్టినరోజునే ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవాసంస్థను స్థాపించారు. అప్పటినుంచి ట్రస్ట్ పేరుతోనే అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2020లో కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ సమయంలో పనుల్లేక, ఆస్పత్రులపాలై నలిగిపోయిన పేదలను ఆదుకునేందుకు ముందుకొచ్చి నేనున్నాంటూ బహుముఖ సేవా కార్యక్రమాలు చేపట్టారు. కరోనా బాధిత కుటుంబాలను ఆదుకోవడంతోపాటు లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయి ఆకలితో అలమటించినవారికి, జిల్లాకు తిరిగి వచ్చిన వలస కూలీలకు రెండు పూటలా భోజనాలు పెడుతూ శ్రీనివాసరావు నిత్యావసర సరుకులు అందజేస్తూ ఆపద్బాంధవుడిగా నిలిచారు. ప్రైవేటు పాఠశాలల సిబ్బందికి, సినిమా హాల్ కార్మికులకు, విశ్వ బ్రాహ్మణులకు, జర్నలిస్టులకు, పేద కళాకారులకు నిత్యవసర కిట్లు పంపిణీ చేశారు. వందలాది మందికి విరాళాలు అందజేశారు. సమాజంలో అన్ని వర్గాలవారికి ఏదో విధంగా సహాయం, సేవ అందజేస్తూ అనతికాలంలోనే అందరి మన్ననలు అందుకున్నారు.

### ప్రత్యేకంగా వంటశాల నిర్మాణం

వ్యాపారంలో ఎంత సంపాదించినా, ఉన్నదాంట్లో నలుగురికి సేవ చేయడంతోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని నమ్మే శ్రీనివాసరావు నిరంతరాయంగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా వేళ ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయిన ఆయన తోటపాలెంలో ఏకంగా ఒక వంటశాలనే నిర్మించి, సిబ్బందిని నియమించి భోజనాలు తయారు చేయించేవారు. వాటిని ప్యాక్‌చేసి కరోనా ఆస్పత్రుల వద్దకు, ప్రధాన మార్గాల్లోకి పంపించి బాధితులకు అందజేసేవారు. ఆ విధంగా లక్షలాది ప్రజల కడుపు నింపి అన్నదాతగా నిలిచారు. కరోనా తర్వాత కూడా ఆర్తుల కోసం ఆ సేవలు కొనసాగిస్తున్నారు. వైద్యం, విద్య, ఆధ్యాత్మిక, క్రీడలు, తదితర రంగాలకు విరివిగా సహాయం అందజేశారు. పేద రోగుల వైద్యానికి ఆర్థికంగా చేయూతనందించడం, క్రీడా కార్యక్రమాలకు అండగా నిలవడం, పేద విద్యార్థులను ఆదుకోవడం, ఆలయాల నిర్మాణం, జీర్ణోద్ధరణ పనులకు భూరి విరాళాలు ఇవ్వడం ఇస్తూ దానకర్ణుడిగా పేరొందారు.







### తోటపాలెం దాహార్తి తీర్చిన దాత

తోటపాలెం ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను గమనించిన సూర శ్రీనివాసరావు 2021లో సొంత నిధులతో మంచినీటి పథకం ఏర్పాటు చేయించారు. అలాగే గ్రామంలో రచ్చబండ కూడా ఏర్పాటు చేశారు. ఇదే గ్రామ సచివాలయానికి మంచినీటి ట్యాంకు, ఎంపీయూపీ స్కూల్లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు.

- ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కరోనా సమయంలో నెలల తరబడి లక్షలాది మంది కరోనా రోగులు, వారి సహాయకులకు భోజన సౌకర్యం కల్పించారు.
- శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులకు అట్టలు, పరీక్ష సామగ్రి ఉచితంగా అందజేశారు.
- తోటపాలెం, ఎచ్చెర్ల పాఠశాలల్లో సరస్వతీ దేవి, అబ్దుల్ కలాం, గాంధీ, వివేకానంద, సర్వేపల్లి రాధాకష్ణ విగ్రహాలు ఏర్పాటు చేయించారు. పాలిటెక్నిక్ కళాశాలకు వాటర్ ప్లాంట్ అందజేశారు.
- సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు క్రీడాసామగ్రి, టీషర్టులు అందజేయడంతోపాటు పోటీలకు అయిన ఖర్చులు భరించారు.
- వాలీబాల్ పోటీల నిర్వహణకు ఆర్థిక సాయం అందజేశారు.
- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురు పేద రోగులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. -ఎచ్చెర్లలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూరి విరాళం అందజేశారు.
- పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేశారు.

- మిగతా 4లో

• ఎడిటోరియల్

# బయటకొస్తున్న పాత చంద్రబాబు!

'నమ్మండి.. నేను మారిపోయాను' అని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఎక్కడికక్కడ చెప్పుకొచ్చారు. ప్రజలు నమ్మారు.. ఓట్లేసి మళ్లీ గెలిపించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రభుత్వం ఏర్పాటు చేశాక.. ఇప్పటివరకు ఆయన తీరు కూడా మారారన్న మాటకే బలం చేకూర్చేలా కనిపించింది. అంతా బాగుందనుకుంటున్నంతలోనే కొత్త చంద్రబాబు స్థానంలో మళ్లీ పాత చంద్రబాబు తెరపైకి వస్తున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా చెబుతుండటంతో 'చంద్రబాబు మారలేదు.. ఇక మారరు' అన్న వ్యాఖ్యలు మొదలయ్యాయి. ఇటీవల అమరావతిలో జరిగిన రాష్ట్రస్థాయి కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు సరిగ్గా పని చేయకపోతే తానే స్వయంగా వచ్చి చర్యలు తీసుకుంటానని, 1995 నాటి చంద్రబాబును చూస్తారంటూ హెచ్చరించారు. అలాగే రెండు రోజుల క్రితం నెల్లూరు జిల్లాలో పర్యటించిన చంద్రబాబు ఒక సమావేశంలో మాట్లాడటానికి ప్రయత్నించగా.. మైక్ కాసేపు మొరాయించింది. దాంతో అసహనానికి గురైన ఆయన సమాచార శాఖ జిల్లా ఉన్నతాధికారిని వేదికపైకి పిలిపించి మందలించారు. ఇప్పటివరకు మాటలతోనే సరిపెడుతున్నానని, పెడచెవిన పెడితే పాత చంద్రబాబును చూపించాల్సి వస్తుందని వేదికపైనుంచే అధికారులను హెచ్చరించారు. ఇక ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు కూడా పాత చంద్రబాబునే గుర్తు చేస్తున్నాయి. గతంలో టీడీపీ ఓటమికి దారితీసిన కార్యక్రమాలు, నిర్ణయాలనే టీడీపీ కూటమి సర్కారు మళ్లీ కొత్తగా అమలు చేయడానికి సిద్ధమవుతుండటం విమర్శలకు, ఆ పార్టీ శ్రేణుల్లో ఆందోళనకు కారణమవుతోంది. ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. 2014-19 మధ్య ఐదేళ్ల కాలంలో అమలుచేసిన జన్మభూమి కార్యక్రమమే 2019 ఎన్నికల్లో ఆ పార్టీ పుట్టి ముంచడానికి దారి తీసిన ప్రధాన కారణాల్లో ఒకటన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. నాడు గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలతో జన్మభూమి కమిటీలు వేసి గ్రామాలపై పెత్తనమంతా వాటికే అప్పగించారు. పింఛన్లు సహా ఏ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమం కావాలన్నా స్థానిక జన్మభూమి కమిటీ సిఫార్సు చేయాల్సిందే. కమిటీ సభ్యులు ఓకే అంటే ఇవ్వాలి.. నో అంటే తిరస్కరించాలి. అభివృద్ధి కార్యక్రమాలు సైతం జన్మభూమి కమిటీలు చెప్పినట్లు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దాంతో అధికార యంత్రాంగం మొత్తం ఈ కమిటీల్లో అదుపాజ్ఞల్లో పనిచేయాల్సిన దుస్థితి. ఈ అధికారాలతోనే మెజారిటీ గ్రామాల్లో జన్మభూమి కమిటీ సభ్యులుగా ఉన్న టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి అవినీతి, ఆశ్రితపక్షపాతానికి, నచ్చనివారిపై కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ఇవే ఆ పార్టీ పరువును గంగలో కలిపేసి 2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయేలా చేశాయన్నది నిర్వివాదాంశం. ఆనాటి చేదు అనుభవాలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయి. అటువంటి జన్మభూమి వ్యవస్థను 2.0 పేరుతో మళ్లీ తీసుకొస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో అటు ప్రజల్లోనూ, ఇటు అధికార యంత్రాంగంలోనూ ఆందోళన మొదలైంది. జన్మభూమి పథకం ద్వారా గ్రామాల్లో 17,500 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 10వేల కిలోమీటర్ల మురుగు కాలువలు నిర్మిస్తామని చెప్పడం వరకు బాగానే ఉన్నా.. మళ్లీ జన్మభూమి కమిటీల చేతుల్లోనే అధికారాన్ని పెడతారన్న అనుమానాలు పెరుగుతున్నాయి. మరోవైపు ప్రపంచ బ్యాంకు రుణం వైపు చంద్రబాబు సర్కారు అడుగులు వేస్తుండటంతో మళ్లీ రుణాలు, ఆంక్షల ఉచ్చులో రాష్ట్రం చిక్కుకుంటుందన్న అనుమానాలు మొదలయ్యాయి. అమరావతి నిర్మాణం, ఇతరత్రా అవసరాలకు నిధుల సమీకరణలో భాగంగా రెండు రోజుల క్రితమే రాష్ట్రానికి వచ్చిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. రుణాలు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు అనే షరతులు పెడుతుంది. ఆంక్షలు విధిస్తుంది. వాటిని అమలు చేయడానికి సిద్ధపడితేనే రుణాలు ఇస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు ఇది మనందరికీ అనుభవంలోకి వచ్చినదే. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలును ప్రపంచ బ్యాంకు అస్సలు అంగీకరించదు. రుణాలు పొందాలంటే వాటినే ఫణంగా పెట్టాల్సి ఉంటుంది. ప్రపంచ బ్యాంకు చెప్పినట్లు అనేక రంగాల్లో సంస్కరణలు అమలు చేయాల్సి ఉంటుంది. విద్యుత్ ఛార్జీల పెంపు, పన్నుల సవరణ వంటివి ఈ సంస్కరణల్లో భాగంగా ఉంటాయి. 1995లో ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడే ఇటువంటి షరతులన్నింటికీ తలొగ్గి ప్రపంచ బ్యాంకు నుంచి భారీగా రుణాలు తీసుకున్నారు. ఆతర్వాత పన్నులు, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఆనాడు కమ్యూనిస్టు పార్టీలు ఈ చర్యలకు వ్యతిరేకంగా తీవ్రంగా ఉద్యమించాయి. చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టారని విమర్శించాయి. దానికితోడు నాటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజాప్రస్థానం పేరుతో ప్రజల్లోకి చొచ్చుకుపోవడంతో చంద్రబాబు అధికారం కోల్పోవాల్సి వచ్చింది. తర్వాత ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయిన వైఎస్ గానీ.. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో సీఎంలుగా చేసిన చంద్రబాబు, జగన్‌లు గానీ ప్రపంచ బ్యాంకు వైపు చూడకుండా ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల పరిధిలోనే దేశీయ ఆర్థిక సంస్థల నుంచే రుణాలు తీసుకుంటూ రాష్ట్ర అవసరాలకు సర్దుబాటు చేసేవారు. కానీ ఇప్పుడు మళ్లీ చంద్రబాబు గత చేదు అనుభవాలను విస్మరించి ప్రపంచబ్యాంకు రుణాలకోసం ప్రయత్నించడం కొరివితో తలగోక్కున్నట్లే అవుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర ప్రజలపై భారం మోపుతారన్న ఆందోళనలు కూడా పెరుగుతున్నాయి.




డిన్క్, సింక్, డిన్క్వాడ్ ఈ పదాలు విన్నారా? ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు యువతరం గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న పదాలు. మీరూ ఓసారి గూగుల్ చేయండి. డిన్క్ (డబుల్ ఇన్కమ్ విత్ నో కిడ్) తరహా ఆలోచన ఉన్నవారు భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటారు. వారిలో కొంతమందికి పిల్లలు కనే తీరుబడి ఉండదు. మరికొందరిలో ఆర్థికంగా స్థిరపడిన తర్వాత చూద్దాంలే అన్న భావన ఉంటుంది. మరి కొందరిలో పిల్లలపై ఆసక్తి అస్సలు ఉండదు. వీకెండ్స్‌లో ఇరువురు సంతోషంగా విహార యాత్రలు చేస్తూ కాలం గడిపేయాలన్న తీరు వీరిది.

# మేం కనలేం.. మేం పెంచలేం!

యునైటెడ్ స్టేట్స్ సెన్సస్ బ్యూరో ఆధారంగా ఫోర్బ్స్ చెప్పినదాని బట్టి 2023 నాటికి అమెరికాలో 42 శాతం వివాహితులు ఈ తరహా గ్రూపులో ఉన్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఇది ఆ ముందు ఏడాది కంటే 7 శాతం ఎక్కువ. అయితే కెరీర్ దృష్ట్యా పిల్లలు వద్దు అనుకునేవారు ఇందులో లేకపోలేదు. కాస్త మంచి కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చి ఒక మోస్తరు జీతం వచ్చేవరకు వేచి చూడాలనుకున్న వారు కొందరు. ఇక రెండో కేటగిరీ వారు సింక్స్ (సింగిల్ ఇన్కమ్ విత్ నో కిడ్స్). వీరు పిల్లలు వద్దు అనుకోవడానికి కారణం కేవలం ఆర్థికపరమైన సమస్యలు. ఇద్దరిలో ఒక్కరు తెచ్చే జీతంతో పిల్లల్ని పెంచి, చదివించలేమన్న భయం వీరిది. మరొకరికి ఉద్యోగం వచ్చాక చూద్దాంలే అనుకుంటూ ఉంటారు. మూడో వర్గం వారు డిన్క్వాడ్ (డబుల్ ఇన్కమ్ విత్ నో కిడ్స్ బట్ విత్ ఏ డాగ్). వీరు డిన్క్ మాదిరిగానే ఇద్దరు ఉద్యోగాలు చేస్తుంటారు. పిల్లలు లేకుండా ఓ కుక్కను పెంచుకుంటారు. దాన్ని పిల్లలతో సమానంగా చూసుకుంటారు. అయితే అది కుక్క మాత్రమే కానక్కర్లేదు. మరే ఇతర పెంపుడు జంతువైన కావొచ్చు.

..ఇది మొత్తానికి విశ్వవ్యాప్తంగా యువకుల్లో ఉన్న ఆలోచన. ఈ తరహా ఆలోచన ఇప్పుడిప్పుడే మన దేశంలో కూడా పెళ్ళైన వారిలో మొదలయింది. ఒకప్పుడు ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చాక పిల్లలతో ఆడుకోవాలని, వారితో గడపాలని అనుకునే వారు. పిల్లలు ఇళ్లలో తిరిగితే ముచ్చట పడేవారు.




ఇప్పుడు ఇన్ఫోసిస్ మూర్తి గారి దయవల్ల రోజుకు 12 గంటలకు పైగా పని చేయాల్సిన దౌర్భాగ్యం. సాఫ్ట్‌వేర్‌లో నిరంతరం మారుతున్న డైనమిక్స్ మరోవైపు. ఈ రోజు నేర్చుకున్నది రేపటికి పాతది అయిపోతుంది. నిరంతరం అప్‌డేట్ అవ్వాలి. కొత్త టెక్నాలజీ తెలుసుకోవాలి. కంపెనీలు తరుచూ మారుతుండాలి. లక్షల్లో తీసుకున్న బ్యాంక్ అప్పుకీ నెలసరి వాయిదాలు కట్టాలి. ఇచ్చిన ప్రాజెక్టు గడువులో పూర్తిచేసి తీరాలన్న ఒత్తిడి. ఇన్నింటి మధ్య పిల్లలు అవసరమా అన్న ఫీలింగ్ ఒకటయితే, ఇద్దరూ ఉద్యోగాలకు పోతే వారిని ఎవరు చూసుకుంటారన్న అనుమానం మరొకటి. ఏదైతేనేం ఇప్పుడు పిల్లలు వద్దు.. ఎలాగో ప్రస్తుతం ఇలా గడవని అనుకున్నవారే ఎక్కువ. దీనివల్ల దేశంలో వృద్ధాప్యపు రేటు పెరిగి పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఇదే ఇప్పుడు అన్ని దేశాలలో సమస్య.

**- సీహెచ్ దుర్గాప్రసాద్**

# వాక్ ఇన్ ఇంటర్వ్యూ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2022/2023/2024 సంవత్సరంలో ఏదైనా డిగ్రీ/ బీటెక్ లేదా పీజీ పూర్తి చేసుకుని ఉన్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జెన్పాక్ట్ సంస్థతో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జెన్పాక్ట్ సంస్థ కంటెంట్ మోడరేషన్, కస్టమర్ సర్వీస్-వాయిస్ సపోర్ట్ విభాగాల్లో ఉద్యోగాలు భర్తీ చేయడానికి వాక్ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడుతుందని, అర్హత, ఆసక్తి, ఇంగ్లీష్ భాషా నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు హెచ్ఆర్ రౌండ్, టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ లింక్ https://bit.ly/46Wzqz6లో రిజిస్టర్ కావాలని, skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

# సమగ్ర విచారణ చేపట్టాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీసీసీ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన ధర్నాలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిడెన్‌బర్గ్ రిపోర్ట్ ద్వారా బహిర్గతమైన అదాని కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. జేపీసీ, సీబీఐ విచారణ కోరుతూ సెబీ చైర్మన్ మాధవి భుచ్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అచ్చుతాపురం పార్మాసెజ్‌లో ఎసెన్షియా కర్మాగారం ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులను, గాయపడినవారిని పరామర్శించారు. కార్యక్రమంలో జే.డి.శీలం, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణపై 24న చర్చావేదిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర వక్ఫ్ చట్టానికి సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకోవడంతో దీనిపై అఖిలపక్ష చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా ముస్లిం ప్రజానీకం తరపున మహిబుల్లాఖాన్ ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు జామియా మసీదు ప్రాంగణంలో జరిగే ఈ చర్చలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొని అభిప్రాయాలు తెలపాలన్నారు. వక్ఫ్ చట్ట సవరణలపై ముస్లిం సమాజానికి కొన్ని అభ్యంతరాలు ఉన్నాయని, దీనిని ఈ వేదిక ద్వారా పంచుకోనున్నట్లు ఆయన తెలిపారు.



ఎవరీ చిరంజీవి? ప్రశ్న చిన్నదే. సమాధానం సముద్రమంత పెద్దది. తెరపై అతని బొమ్మ చూడ్డానికి వేచి చూసిన కళ్లు కథలు కథలుగా చెబుతాయి. చిరంజీవి అంటే ఏమిటో..?! టికెట్ల కోసం క్యూలో నిలబడి అలసిన కాళ్లు, తెగిన చెప్పులూ, చిరిగిన చొక్కాలూ, తనవల్ల కాలగర్భంలో కలసిపోయిన రికార్డులు, కొత్తగా పుట్టుకొచ్చిన సంచలనాలూ పూస గుచ్చినట్టు వివరిస్తాయి. మాస్ మానియాకు మీనింగ్ ఎవరో?! థియేటర్ల ముందు ప్రతిష్టించిన కటౌట్లు, ఇష్టంగా తలలు బద్దలు కొట్టుకొన్న కొబ్బరి కాయలు, ప్రేమతో ఒళ్లు కాల్చుకొన్న హారతి కర్పూరాలూ విపులంగా వర్ణిస్తాయి. మెగా స్టార్ అనేది ఎందుకో..?! స్వయంకృషిని డీకోడ్ చేస్తే వచ్చే పేరు.. చిరంజీవి! కష్టజీవికి కేరాఫ్ అడ్రస్స్..చిరంజీవి!! అభిమానులకు అన్నయ్య ఆపదన్నవాళ్లకు ఆపద్బాంధవుడు బాక్సాఫీసుకు ఘరానా మొగుడు రికార్డుల గ్యాంగ్‌లీడర్.. అన్నింటికీ ఒక్కటే సమాధానం.. చిరంజీవి!!!

చిరంజీవి అంటే రెండున్నర గంటల సినిమా కాదు. జీవిత కాల జ్ఞాపకం. చిత్రసీమలో అడుగుపెట్టిన ప్రతీ ఒక్కరూ ఏదో ఒకటి నేర్చుకొనే వెళ్లారు. కానీ చిత్రసీమకే కొత్త పాఠాలు నేర్పాడు చిరంజీవి. మాస్ సినిమా అర్థం మార్చి, కమర్షియాలిటీని హైవే ఎక్కించిన హీరోయిజం చిరంజీవి సొంతం. ఇప్పుడు తెలుగు సినిమా మార్కెట్, స్థాయి పెరిగిందని సంబరపడుతున్నాం కానీ, ఆ ప్రయాణానికి తొలి అడుగు వేసిన వాడు చిరంజీవి.తెలుగు సినిమాకు తొలి రూ.5 కోట్ల వసూళ్లు, తొలి పది కోట్ల అంకెలు చూపించింది చిరంజీవి. కోటి రూపాయల పారితోషికం అందుకొన్న తొలి హీరో చిరంజీవి.

# ఒక్కడే సూర్యుడు.. ఒక్కడే చంద్రుడు.. ఒక్కడే మెగాస్టార్!

స్టార్‌డమ్‌లో, ఫ్యాన్ ఫాలోయింగ్ లో బాలీవుడ్ హీరోలకు మనవాళ్లూ ఏ మాత్రం తీసిపోరని నిరూపించిన వాడు చిరంజీవి. పాటలొస్తున్నాయంటే సీట్ల నుంచి పారిపోయే 'సిగరెట్' బ్యాచ్ కాళ్లకు సంకెళ్లు వేసి, కళ్లన్నీ వెండి తెరకే అంకితం చేయించి, తన స్టెప్పులతో తెలుగు సినిమాని ఎన్నో 'స్టెప్పులు' పైకి ఎదిగేలా చేసిన హీరో చిరంజీవి. తెలుగు సినిమాని చిరంజీవికి ముందు, చిరంజీవి తరవాత అని రెండుగా విడగొట్టి చూస్తే, చిరు రాకతో సంభవించిన విప్లవాత్మక మార్పులు అర్థమవుతాయి. తాను ఎదగడమే కాదు, తన చుట్టూ ఉన్నవాళ్లని సైతం ఎదిగేలా తోడ్పాడు అందించాడు చిరు. చిరుని చూసి 'మనం కూడా హీరోలైపోవొచ్చు' అని ధైర్యం తెచ్చుకొని, హీరోలైపోయి, స్టార్‌డమ్ సంపాదించుకొన్నవాళ్లు ఎందరో. ఆ హీరోల వెనుక ఉన్న అదృశ్య హస్తం చిరంజీవినే. మెగా కుటుంబం అని కుళ్లుకుంటారు కానీ, ఆ కుటుంబం చిత్రసీమకు దశాబ్దాలుగా వెన్నుదన్నుగా చిలిచిన సంగతి ఎవరూ మర్చిపోకూడదు. సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలన్న తలపు చిరుని మరింత ప్రత్యేకంగా నిలిపింది. బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంకుల ద్వారా చేసిన సేవ, కరోనా సమయంలో చిత్రసీమనంతటినీ సంఘటిత పరిచి, ఆదుకొన్న విధానం అభిమానులకు ఎప్పటికీ గుర్తే.

చిరు అందరి వాడే కానీ, అందనివాడు మాత్రం కాదు. సాధారణంగా చిరంజీవిలాంటి వ్యక్తుల్ని కలుసుకోవడానికి ఆపసోపాలు పడాల్సివస్తుంటుంది. కానీ చిరు అందరికీ అందుబాటులో ఉంటాడు. 'జబర్దస్త్' ఆర్టిస్టులు సైతం చిరుని కలుసుకోగలరు. తనని ఎవరు కలిసినా పేరు పేరునా పలకరించే వ్యక్తిత్వం. 'అన్నయ్యా..' అంటూ అభయ హస్తం అందివ్వగలిగే మనస్తత్వం.. చిరుని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాయి. చిత్రసీమలో ఇన్నేళ్లయినా మెగా కిరీటం ఆయనదే. ఎంతమంది కొత్త హీరోలు వచ్చినా, ఈతరం హీరోలు ఎన్ని వెయ్యి కోట్ల సినిమాలు తీసినా చిరు బ్లాక్ బస్టర్ సినిమాల ముందు దిగదుడుపే. చిరుని ఎంతో మంది ప్రేమించారు. ప్రేమిస్తూనే ఉంటారు. ఆఖరికి తనని ద్వేషించిన వాళ్లకు సైతం ప్రేమని పంచిపెట్టగలడం చిరుకి మాత్రమే సాధ్యం. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా చిత్రసీమలోకి వచ్చి, తన చరిత తానే రాసుకొని, ఎంతోమందికి బ్యాక్‌బోన్‌గా నిలిచిన చిరు.. ఇప్పటికీ ఎప్పటికీ మెగాస్టారే. భవిష్యత్తులో ఎంతమంది హీరోలొచ్చినా చిరుని రిప్లేస్ చేసే శక్తి ఎవ్వరికీ ఉండదు. ఎందుకంటే.. ఒకడే సూర్యుడు. ఒకడే చంద్రుడు. ఒకడే మెగాస్టార్.

(ఈరోజు మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా)

# విశ్వంభర సర్ ప్రైజ్.. ఇది హై వోల్టేజ్ లుక్

మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే మరో బిగ్గెస్ట్ ప్రాజెక్టుగా 'విశ్వంభర' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'బింబిసార'తో సూపర్ హిట్ కొట్టిన దర్శకుడు వశిష్ట ఈ సినిమాను అంతకుమించి అనేలా తెరపైకి తీసుకురానున్నాడు. 'విశ్వంభర' చిత్రంలో నెవ్వర్ బిఫోర్ ఫాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయని తెలుస్తోంది. అత్యున్నతమైన విజువల్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుందని మేకర్స్ ఇదివరకే ఒక క్లారిటీ ఇచ్చారు. ఇక యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న ఈ చిత్రంలో, హై ఓల్టేజ్ యాక్షన్ సీన్లు, హృదయాన్ని తాకే డ్రామా మరింత హైలెట్ అవుతాయని సమాచారం. ఇక నేడు మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్పెషల్ లుక్‌ను విడుదల చేశారు. ఇటీవలే ఈ సినిమా ప్రీ-లుక్ పోస్టర్ ద్వారా ఆసక్తిని రేకెత్తించిన మేకర్స్, ఇప్పుడు ఫస్ట్ లుక్‌తో ప్రేక్షకులకు మరో సర్ ప్రైజ్ ఇచ్చారు. ఈ పోస్టర్‌లో చిరంజీవి ఒక కొండపై కూర్చొని, శక్తివంతమైన త్రిశూలాన్ని తన చేతుల్లో పట్టుకొని ఉన్న తీరు అద్భుతంగా ఉంది. ఏదో కొత్త ప్రపంచాన్ని చూపించనున్నట్లు తెలుస్తోంది. *When Myths Collide, Legends Rise* అనే ట్యాగ్ తో హై వోల్టేజ్ వైబ్ క్రియేట్ చేశారు. మెరుపుల మధ్యలో పర్వతాలు హైలెట్ అయిన దృశ్యం కూడా సూపర్బ్ అనేలా ఉంది. చిరంజీవి కొత్తగా కనిపిస్తుండగా, ఆయన చూపులోని సీరియస్ నేచర్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఆకాశంలో మెరుపులు, పర్వతాల మధ్య రహస్య శక్తులు పోటెత్తుతున్నట్లుగా ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో, సినిమా పై అంచనాలు మరింతగా పెరిగాయి. టాలీవుడ్‌లోని ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన యూవీ క్రియేషన్స్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్, అశికా రంగనాథ్ లాంటి కథానాయికలు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, కునాల్ కపూర్ ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇక ఆస్కార్ విజేత ఎమ్.ఎమ్. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. చాలా కాలం తరువాత మెగాస్టార్ సినిమాకు ఆయన వర్క్ చేస్తుండడంతో మ్యూజిక్ పై కూడా అంచనాలు గట్టిగానే ఉన్నాయి. ఇక స్పెషల్ పోస్టర్ తో మేకర్స్ మెగాస్టార్‌కు విషెస్ అందిస్తూ ఒక మంచి సర్ ప్రైజ్ ఇచ్చారు. అలాగే విశ్వంభర సినిమా 2025 జనవరి 10న గ్రాండ్ గా విడుదల అవుతుందని మరోసారి క్లారిటీ ఇచ్చారు.

**– తుపాకి.కామ్ సౌజన్యంతో...**






### లేటరల్ ఎంట్రీ పేరుతో ప్రైవేట్ ఐఏఎస్‌లకు నాంది పలికిన కేంద్రం

### 45 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిన యుపీఎస్సీ

### ప్రతిపక్షాలు విరుచుకుపడడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం

# ప్రైవేటు ఐఏఎస్.. ప్రతిపాదన రద్దు!




- దుప్పల రవికుమార్

గత శనివారం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) ఒక ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. అది కేంద్ర సివిల్ సర్వీసుల్లో జాయింట్ సెక్రటరీ, డైరక్టర్ లేదా డెప్యూటి సెక్రటరీ హోదాలో సుమారు 24 మంత్రిత్వ శాఖలలో పని చేయడానికి 45 ఖాళీలను ప్రకటిస్తూ వచ్చిన ప్రకటన. ఐఏఎస్‌తో సమాన హోదాలో పనిచేసే వీరు విద్యాసంస్థల నుంచి గాని, పారిశ్రామిక సంస్థల నుంచి గాని పదిహేనేళ్లకు పైబడి అనుభవం ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. చాలా ముఖ్యమైన మంత్రిత్వ శాఖల్లో కీలకమైన హోదాలో పనిచేసే అవకాశం ఉండడంతో చాలా మందికి ఆశలు మోసులెత్తాయి. సివిల్ సర్వీసు పరీక్షలు రాయకుండా అదే హోదాను కాంట్రాక్టు పద్ధతిన లేదా డెప్యుటేషన్ పద్ధతిన మూడు నుంచి ఐదేళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించాలనుకునేవారికి సువర్ణ అవకాశంగా కనిపించింది. కాని, భారత జనతా పార్టీ వ్యూహం వేరే. దానిని పసిగట్టిన ప్రతిపక్షాలు సివిల్ సర్వీసుల్లో లేటరల్ ఎంట్రీ పద్ధతిని నిర్ద్వంద్వంగా తోసిపుచ్చాయి. ఈ విధమైన ఉద్యోగ నియామకాలు దొడ్డిదారిన రిజర్వేషన్లను తుంగలో తొక్కుతాయని అభిప్రాయపడ్డాయి. సామాజిక సమానత్వం కోసం రాజ్యాంగం కల్పించిన అన్ని రకాల అవకాశాలను తోసిపుచ్చినట్లవుతుందని, అది ఒక విధంగా రాజ్యాంగంపై దాడి చేసినట్లవుతుందని వివిధ ప్రతిపక్షాలు ముక్తకంఠంతో హెచ్చరించాయి. దాంతో వెంటనే కేంద్ర ప్రభుత్వం నాలుక కరుచుకుని యుపిఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేయమని ఆదేశించింది.

అయితే ఈ లేటరల్ ఎంట్రీ విధానం మోదీ మానస పుత్రిక కాదు. మునుపెన్నడూ లేనిది కూడా కాదు. నిజానికి యుపిఏ ప్రభుత్వ హయాంలో 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం రెండో పరిపాలన పరమైన సంస్కరణల కమిషన్ వేసింది. దీని చైర్మన్ వీరప్ప మొయిలీ. సంప్రదాయబద్ధ సివిల్ సర్వీసు అధికారులు అందించజాలని సేవలను అందించేందుకు వివిధ మంత్రిత్వ శాఖలలో ప్రత్యేక నైపుణ్యం, జ్ఞానం ఉన్నవారిని నియమించుకోవాలని ఈ కమిషన్ సిఫారసు చేసింది. అయితే వీటన్నింటికంటే ముందునుంచే వివిధ ప్రభుత్వేతర విభాగాల్లో పని చేస్తున్న అనుభవజ్ఞులైన అధికారులను ప్రభుత్వంలోకి తీసుకోవడం 1950ల నుంచే సంప్రదాయంగా వస్తోంది. జవహర్‌లాల్ నెహ్రూ హయాం నుంచీ ఎంతోమంది నిష్ణాతులను ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుంచి సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్‌లోకి తీసుకు వచ్చిన ఉదంతాలు ఉన్నాయి. ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) సంస్థలో సహాయ ఆర్థిక సలహాదారుగా పని చేస్తోన్న ఐజి పటేల్‌ను ఆర్థిక శాఖలో ఆర్థిక విభాగాల కార్యదర్శిగా నియమించారు. తర్వాత అతనినే రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాకు గవర్నరుగా కూడా చేసారు. అంతెందుకు మన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా ఐఏఎస్ అధికారి కాదు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో అంతర్జాతీయ వర్తకం గురించి పాఠాలు చెప్పే ఒక ప్రొఫెసర్. 1971లో అతనిని వాణిజ్య మంత్రిత్వ శాఖలో ఆర్థిక సలహాదారుగా తీసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వంలో అనేక బాధ్యతలు విజయవంతంగా మన్మోహన్‌సింగ్ నిర్వహించిన సంగతి మనకు తెలిసిందే. 2002లో విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టే సమయంలో అత్యవసరం అనుకుని వాజ్‌పేయి ప్రభుత్వం ఆర్.వి.షాహిని విద్యుత్ రంగ కార్యదర్శిగా నియమించింది. ఆయన అప్పటికి ప్రైవేటు రంగంలో పనిచేసేవారు.

**ప్రత్యేక వ్యక్తుల నియామకం నెహ్రూ నుంచి ఉన్నదే!**

కేంద్ర ప్రభుత్వ పరిపాలన విభాగపు ముఖచిత్రాన్ని మార్చడానికి 2017లో నీతి ఆయోగ్ మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. సివిల్ సర్వీసు పరీక్షలు రాసి వచ్చేవారితో పాటు మరికొంత మంది వివిధ రంగాల నిపుణులను లేటరల్ ఎంట్రీ పద్ధతి ద్వారా నియామకాలు చేపట్టి మరింత మెరుగైన సేవలందించే విధంగా తయారుచేయవచ్చని సూచించింది. వీటిని అనుసరించి 2018 నుంచి కూడా మోదీ ప్రభుత్వం ప్రతి ఏటా జాయింట్ సెక్రటరీ హోదాలో కొన్ని పోస్టులను నింపుతూ వస్తోంది. చాలా విచిత్రమైన విషయం ఏమంటే గడచిన ఐదేళ్లలో 63 మందిని వివిధ విభాగాలలో ఈ లేటరల్ ఎంట్రీ పద్ధతిలో ఉద్యోగాలలో తీసుకోగా వారిలో 57 మంది ఇప్పటికీ విజయవంతంగా ఆ పోస్టులలో కొనసాగుతున్నారు. దీనిని ఇటీవలే కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈసారి నోటిఫికేషన్‌లో జాయింట్ సెక్రటరీతో పాటు డెప్యూటీ సెక్రటరీ, డైరక్టర్ల హోదాలు చేర్చడం, మంత్రిత్వ శాఖలు పెంచి పోస్టుల సంఖ్య పెంచడం కూడా పెద్ద ఎత్తున నిరసన రావడానికి ఒక కారణమైంది.

ఈ విధమైన లేటరల్ ఎంట్రీ నియామకాలలో ప్రతి ఉద్యోగం సింగిల్ పోస్ట్ కేడర్‌గా ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీంతో ఆ పోస్ట్ ఎంపికకు రిజర్వేషన్ సూత్రాలు వర్తించవు. 13 పాయింట్ల రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్ అమలు జరపాల్సిన అవసరం లేకపోవడమే ఈ పోస్టులకు తెచ్చిపెట్టిన తలవంపు అయింది. రిజర్వేషన్లతో సంబంధం లేకుండా కేవలం మెరిట్ ప్రాతిపదికన ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన వ్యక్తుల సేవలకు మాత్రమే ఈ పోస్టులు ఉద్దేశించినవని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ ప్రతిపక్షాలు వినే పరిస్థితిలో లేవు. పైగా కాంట్రాక్టు లేదా డెప్యుటేషన్ పద్ధతిలో వచ్చిన ఈ అధికారులు తమ పదవీకాలం పొడిగింపునకు అత్యంత విధేయత నుంచి వీర విధేయత ఒలకబోస్తారని మరికొందరు భయపడుతున్నారు. వీటన్నిటినీ మించిన భయం ఏమంటే, ఈ పద్ధతిలో జరిగే నియామకాల్లో కీలకమైన శాఖల్లోకి ఆర్ఎస్సెస్‌కు చెందిన వ్యక్తులను ప్రభుత్వంలోకి తీసుకురావడానికి ఇది దగ్గరిదారిగా మోదీ ప్రభుత్వం భావిస్తోందని మరికొంతమంది అనుమానిస్తున్నారు. తమకు కావలసిన వ్యక్తులను ఆయా పోస్టుల్లో నియమించడం ద్వారా ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకత లోపించడమే కాకుండా ఆశ్రితపక్షపాతానికి దారితీస్తుంది.

**మోదీ పాలనకు దెబ్బమీద దెబ్బ**

శనివారం వచ్చిన యుపిఎస్సీ ఉద్యోగ ప్రకటన సోమవారానికి రద్దయిపోవడం నిజంగా ఆలోచించవలసిన విషయం. నరేంద్రమోదీ ఒంటెద్దు పోకడలను నిలువరించడానికి ఈసారి ప్రతిపక్షాలు ఎంతకైనా తెగించేందుకే సిద్ధపడ్డాయని దేశ ప్రజలకు అర్థమవుతోంది. ఇప్పటిదాకా ఎవరు ఎంత చెప్పినా వినకుండా ఏటికేడాది ఇదే పద్ధతిలో ప్రైవేటు ఐఏఎస్ సైన్యాన్ని తయారుచేస్తోన్న ప్రధాని నరేంద్రమోది, ఈసారి ఏకంగా నోటిఫికేషన్ రద్దు చేయడం పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది. తాము చేసిన, చేస్తోన్న ఈ లేటరల్ ఎంట్రీ నియామకాల పని తప్పని ఒప్పుకున్నట్టే అవుతోందని కొంత మంది సీనియర్ బీజేపీ నాయకులు సందేహిస్తున్నారు. ఇన్నాళ్లూ తమ ప్రభుత్వం ఈ నియామకాల్లో రాజ్యాంగం ఉద్దేశించిన సామాజిక న్యాయం, సమగ్రతలను తుంగలో తొక్కినట్టు ఈ సంఘటన స్పష్టం చేస్తుందని వారు భావిస్తున్నారు.

యుపిఎస్సీ లేటరల్ ఎంట్రీ నియామక ప్రకటన రద్దుతో ఒకే నెలలో నాలుగుసార్లు మోదీ తీసుకున్న నిర్ణయాలను వెనక్కు తీసుకున్నట్టయింది. తాము తీసుకున్న నిర్ణయాలు తప్పుడు నిర్ణయాలని చెప్పకనే చెప్పినట్లయింది. మోదీ పరిపాలనలో డొల్లతనాన్ని ఈ నాలుగు యూ టర్న్‌లు తెలియజెప్తున్నాయి. ఈ ఏడాది ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో దీర్ఘకాలిక కాపిటల్ గెయిన్స్ టాక్సులకు సంబంధించిన ప్రతిపాదనను వెనక్కి తీసుకోవడానికి ఇంకా నెల పూర్తి కాలేదు. తర్వాత లోక్‌సభ సెషన్స్ జరుగుతుండగానే రాజ్యసభలో పెద్దఎత్తున జరిగిన చర్చ ఫలితంగా వక్ఫ్ (సవరణ) బిల్లును ఎంపిక చేసిన కమిటీకి పంపించడం రెండో ఎదురుదెబ్బ. కాగా బ్రాడ్‌కాస్ట్ ముసాయిదా బిల్లును ఏకంగా ఉపసంహరించుకోవడం మూడో ప్రతీఘాతంగా భావించవచ్చు. ఇప్పుడు ఈ నియామక ప్రకటన రద్దు చేయడం నాలుగో ఎదురుదెబ్బగా ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ప్రజలంతా కలిసి వస్తే మోదీ నిరంకుశ పాలనకు అడ్డుకట్ట వేయవచ్చుని ఈ సందర్భంగా కాంగ్రెస్ పెద్దలు గట్టిగా చెప్తున్నారు.

## మెగాస్టార్ జన్మదిన వేడుకలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం

పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు సీనియర్ మెగా అభిమానులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం కేక్ కట్ చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన శ్రీ నీలమ్మ తల్లి వాడ బలిజ యువజన సేవా సంఘం అధ్యక్షులు మైలపల్లి నరసింహమూర్తి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ జిల్లా అభిమాన సంఘ అధ్యక్షులు ఎస్.సిద్దయ్య, కె.మురళి, కె.లక్ష్మణ, జి.కొర్లయ్య, పేర్ల మోహన్, ఎం.రాజేష్, అడ్ల రాజు, సీహెచ్ కన్నారావు, పి.వినోద్, కె.ఉదయ్, కె.ప్రదీప్, బి.లక్ష్మణ, వర్మ, బి.కుమార్, కె.రవిశేఖర్, సీహెచ్ మురళీ, ప్రవీణ్, మణి, కొండా సింహాచలం, లోకేష్, సూరద సత్యం, మెగాస్టార్ అభిమానులు పాల్గొన్నారు.

### ఓబీసీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా త్రినాథరెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అలపాన త్రినాథ రెడ్డి నియమితులయ్యారు. ఆల్ ఇండియా జాతీయ అధ్యక్షులు పాతల ప్రసాద్‌నాయుడు ఆదేశాలు, రాష్ట్ర అధ్యక్షులు సూచనల మేరకు జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఉత్తరాంధ్ర సెక్రటరీ రౌతు శంకర్రావు నియమించినట్లు త్రినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం బీసీ సంఘాల సీనియర్ నాయకుడుగా, రాష్ట్ర రెడ్డిక కుల నాయకుడిగా, మంచి సంఘ సేవకునిగా, అన్ని సామాజిక సామాజిక వర్గాలతో కలుపుకుని వెళ్లే వ్యక్తిగా త్రినాథ్ రెడ్డికి గుర్తింపు ఉంది. ఈయన ప్రస్తుతం శ్రీకాకుళం రెడ్డిక సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా, జిల్లా బీసీ సంఘాల ప్రచార కార్యదర్శిగా, రాష్ట్ర కుల నాయకుడిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా త్రినాథరెడ్డి మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి కృషి చేస్తానని, తన కర్తవ్యాన్ని త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన జాతీయ అధ్యక్షులు పోతల ప్రసాద్ నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు, ఉత్తరాంధ్ర సెక్రటరీ రౌతు శంకర్రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆదర్శప్రాయుడు వరుదు బాబ్జి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పేదలు బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన వరుదు బాబ్జి ఆదర్శప్రాయులని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సారవకోట మండలం అలుదు గ్రామంలో గురువారం వరుదు బాబ్జి నాలుగవ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం పుణ్యక్షేత్రమైన అరసవిల్లి ఆలయ నిర్మాణంలో వరుదుబాబ్జి కీలక పాత్ర పోషించారన్నారు. జిల్లావ్యాప్తంగా అనేక ఆలయాలు, పాఠశాల నిర్మాణంలోనూ ఆయన తన సహాయసహకారాలు అందించినట్లు పేర్కొన్నారు. ఆ మహనీయుని విగ్రహం ఆవిష్కరించడం తనకు ఆనందంగా ఉందని చెప్పారు. మహనీయులు చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. అటువంటి వారి కోవకే వరుదు బాబ్జి చెందుతారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి స్వాతి శంకర్, కుమారులు కుమార్తెలు, బాబ్జి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దివ్యాంగుల వైద్య పరీక్షల రిపోర్టులో లోపాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లాలో నకిలీ దివ్యాంగ సర్టిఫికేట్లపై అందిన ఫిర్యాదులతో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సూచనల మేరకు ఈ నెల 20న రిమ్స్ ఆసుపత్రిలో సుమారు 61 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రిపోర్టును రిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రిపోర్టును పరిశీలించిన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నకిలీ దివ్యాంగ సర్టిఫికేట్లను నిరోధించాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినప్పటికీ, వైద్యాధికారులు పూర్తి సమాచారంతో వైద్య పరీక్షల రిపోర్టును అందజేయలేదని తెలిపారు. మెడికల్ ఎగ్జామినేషన్ రిపోర్టులో 11 మంది ఏ గ్రామానికి చెందినవారో రిపోర్టులో నమోదు లేదని, 15 మందికి సదరం ఐడీలు నమోదు చేయలేదని, 11 మందికి సదరం ఐడీలు నమోదు చేయకుండానే మునుపటి అంచనా నమోదు చేశారని, సదరం సర్టిఫికేట్లు లేకుండా, పాత వైకల్యం శాతం ఏ విధంగా నమోదు చేశారని ప్రశ్నించారు. ఈఎన్‌టీకి సంబంధించి ఏడుగురు, బీఈఆర్‌ఏ టెస్టుకు ప్రతిపాదించారని, కానీ వారి ప్రీవియస్ అసెస్‌మెంట్ నమోదు చేయలేదని తెలిపారు. వెంటనే, పూర్తి వివరాలతో మరోసారి రిపోర్టు అందజేయాలని, రిపోర్టులో నకిలీలని తేలిన సర్టిఫికేట్లను జారీచేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు కోరారు.

### మెంటాడ స్వరూప్‌కు జగన్మోహన్‌రెడ్డి అభినందన



బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జగన్ మోహనరెడ్డిని శ్రీకాకుళం జిల్లా యువజన అధ్యక్షులు మెంటాడ స్వరూప్ కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాడేరు నియోజకవర్గ ప్రజాప్రతినిధులను సమన్వయపరిచే బాధ్యతను సక్రమంగా చేసినందుకు జగన్ అభినందించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

### శ్రీవారిని దర్శించుకున్న కలిశెట్టి



**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోను, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అభిమానులు తనను సన్మానించేందుకు ప్రాధాన్యమిస్తున్నారని, ఇకపై అలా కాకుండా సన్మానించేందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని అన్నా క్యాంటీన్ల నిర్వహణకు విరాళంగా అందచేయాలని అభ్యర్థించారు. సీఎం ఫండ్‌కు ఫోన్ పే చేసి తనకు స్క్రీన్ షాట్స్ పెడితే సంతోషిస్తానని అన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణకు విరాళాలు ఇవ్వాలనుకునే దాతలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అన్న క్యాంటీన్స్, అకౌంట్ నెంబర్ – 37818165097, IFSC - SBIN0020541 చంద్రమౌళినగర్, గుంటూరు బ్రాంచికి పంపాలని కోరారు.












# దాతృత్వ ధీరుడు.. సామాజిక వైద్యుడు















(మొదటిపేజీ తరువాయి)

- జిల్లా వ్యాప్తంగా అనేక దేవాలయాల నిర్మాణానికి విరాళాలు అందజేశారు.
- అత్యవసర వేళ ప్రజలను సకాలంలో ఆస్పత్రులకు తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.
- శ్రీకాకుళం రూరల్ మండలం అంపోలు సబ్ జైలులో గాంధీ విగ్రహం ఏర్పాటుతో పాటు ఖైదీల అవసరార్థం పిండిమిల్లు కూడా అందించారు.
- మృతి చెందిన పలువురు జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు.
- ప్రతి ఏటా ఉగాది, సంక్రాంతి పండుగల సందర్భంగా నిరుపేదలకు వస్త్రదానం చేస్తున్నారు.
- చదువులో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్న పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పుస్తకాలు అందిస్తున్నారు.
- నగరంతో పాటు పరిసర గ్రామాల్లోని క్యాన్సర్ బాధితులకు ఆర్థిక సహాయం చేయడంతోపాటు మెడికల్ కిట్లు పంపిణీ చేశారు.
- పలు క్రీడా టోర్నమెంట్ల నిర్వహణకు సహాయ సహకారాలు అందించారు.

జాతీయ విద్యావిధానానికి సహకారం

- ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ విద్యా విధానం అమలుకు తనవంతు సహకారం అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతూ గత జూలై 17న ఏకాదశి పురస్కరించుకొని ఆహర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
- శ్రీసుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో అరసవల్లి ఇంద్ర పుష్కరిణి వద్ద ఈ ఏడాది జూలై 10న అవధాన సరస్వతి డాక్టర్ బలుసు అపర్ణ ద్విశతావధాన కళా విలాసం, అపర్ణ ప్రతిభా కిరణ ద్యోతకం కార్యక్రమంలో అవధానులచే సత్కారం అందుకున్నారు.
- నగరంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం-4కు ఫ్యాన్లు, లైట్లు ఉచితంగా అందించారు.
- ఈ ఏడాది రంజాన్ సందర్భంగా నగరంలోని సూర్యమహల్ వద్ద ఉన్న జామియా మసీదులో పేద ముస్లింలకు నిత్యావసర కిట్లు, దుస్తులు అందించారు.
- మొన్న వేసవి సీజనులో నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద తమ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం నిర్వహించి విద్యార్థులు, ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారి దాహార్తి తీర్చారు.
- ఎచ్చెర్ల, శ్రీకాకుళం, సంతబొమ్మాళి మండలం మర్రిపాడు, మేఘవరం, వాలీవలస, వడ్డివాడ, పొన్నాడ, తామాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామాగ్రిని అందజేశారు.
- అరసవల్లి సూర్యనారాయణ స్వామి జయంతి(రథసప్తమి) ఉత్సవాల సందర్భంగా సుమారు 2,500 మంది భక్తులకు పులిహోర ప్యాకెట్లు, మంచినీరు సరఫరా చేశారు.
- ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి పూజల సందర్భంగా ఆలయానికి వచ్చిన సుమారు మూడువేల మంది భక్తులకు అన్నదానం చేశారు.





## డీఈవో చిత్తమే.. 'ఉత్తమ' అర్హత!

- ✔ ఉత్తమ టీచర్ల ఎంపికలో ఇష్టారాజ్యం
- ✔ తక్కువ కాంపోనెంట్ పాయింట్లు వచ్చినా జాబితాలో చోటు
- ✔ తిరుమల చైతన్య పైత్యానికి రాజకీయ సిఫార్సుల ముసుగు
- ✔ ఫిర్యాదు అందడంతో రీ వెరిఫికేషన్‌కు కలెక్టర్ ఆదేశాలు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ ఉపాధ్యాయం అవార్డులకు జిల్లా నుంచి సిఫార్సు చేసిన లిస్టుపై విద్యాశాఖలో రచ్చ ప్రారంభమైంది. ఈ అవార్డులకు అర్హులను ఎంపిక చేసిన తీరుపై ఉపాధ్యాయులతోపాటు వారి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తామన్న మంత్రి లోకేష్ ప్రకటనకు విరుద్ధంగా జిల్లాలో అధికారులు వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయిలో నియమించిన ఎంపిక కమిటీని డీఈవో తిరుమల చైతన్య ప్రభావితం చేసి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సూచించిన పేర్లనే కలెక్టర్‌కు పంపించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు పి.షన్ముఖరావు, ఎస్జీటీ కేటగిరీలో జి.సిగడాం మండలానికి చెందిన టేకి రామకృష్ణ పేర్లను సిఫార్సు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ప్రతిపాదనపై ఈ నెల 17న కలెక్టర్‌తో సంతకం చేయించి రాష్ట్రస్థాయిలో లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీకి జిల్లా విద్యాశాఖకు చెందిన ఒక ఉద్యోగి ద్వారా పంపించారు.


**సర్వీస్ లేదు.. కాంపొనెంట్ పాయింట్లు తక్కువ**

ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ప్రతిపాదనలు పంపే విషయంలో జిల్లా కమిటీ పారదర్శకంగా పని చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్జీటీగా ఉంటూ స్కూల్ అసిస్టెంట్ అయిన పి.షన్ముఖరావును రెండేళ్ల సర్వీసు పూర్తికాకుండా ఎంపిక చేసినట్టు టీచర్లు ఆరోపిస్తున్నారు. ఎక్కువ కాంపొనెంట్ పాయింట్లు సంపాదించిన ఉపాధ్యాయులను కాదని సక్రమంగా స్కూలుకు హాజరు కానీ షన్ముఖరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. షన్ముఖరావుకు కేవలం 67 కాంపొనెంట్ పాయింట్లు మాత్రమే వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. డీఈవో తిరుమలచైతన్యకు దగ్గరలోనే పని చేస్తున్న ఒక స్కూల్ అసిస్టెంట్‌కు 85 కాంపొనెంట్ పాయింట్లు ఉన్నా, అతన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ విషయంలో డీఈవో తిరుమల చైతన్య వివక్షతో వ్యవహరించి ఆయన్ను తప్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డు పొందిన స్వర్ణకుమారి దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేయడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ ఫైల్ మరోసారి సర్క్యులేట్ చేయాలని డీఈవో తిరుమల చైతన్యకు ఆదేశించినట్టు సమాచారం.

**డీఈవో ఇష్టానికి రాజకీయ కవర్**

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ప్రతి జిల్లా నుంచి పలు కేటగిరీల్లో అర్హులైన వారితో జాబితాలు రూపొందించి పంపిస్తారు. రాజధాని స్థాయిలో వాటిని పరిశీలించి కొందరిని ఫైనల్‌గా ఎంపిక చేసి అవార్డులిస్తారు. జిల్లాస్థాయి ఎంపిక కమిటీలో కలెక్టర్ నామినేట్ చేసిన ఒకరితోపాటు జాయింట్ కలెక్టర్, ఒక విద్యావేత్త సభ్యులుగా ఉంటారు. సాధారణంగా ఈ వ్యవహారంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారులు తలదూర్చరు. డీఈవో కార్యాలయం నుంచి వచ్చిన జాబితానే ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు డీఈవో కార్యాలయ స్థాయిలోనే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీల్లో ఎంపిక అస్తవ్యస్తంగా జరిగిందన్నది ఫిర్యాదు. దాంతో కలెక్టర్ రీవెరిఫికేషన్‌కు పంపించారు. అవార్డులకు పరిగణనలోకి తీసుకునే ఉపాధ్యాయుల పనితీరును 23 అంశాల్లో బేరీజు వేసి కాంపొనెంట్ పాయింట్లు ఇస్తారు. వీటిని డిప్యూటీ డీఈవో, మండల స్థాయిలో ఎంఈవోలు పరిశీలించి డీఈవో కార్యాలయానికి పంపించాలి. కానీ ఈ పద్ధతి పాటించడం మానేసి చాలా కాలమైంది. దానికి బదులు డీఈవోను ప్రసన్నం చేసుకుంటే రాష్ట్ర జాబితాలో పేరు చేరిపోతుంది. ఎవరైనా ప్రశ్నిస్తే ఎమ్మెల్యే, మంత్రుల సిఫార్సు లేఖ తెచ్చుకున్నారని, అందుకే పేరు పెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు. వాస్తవానికి వారికి ఈ సలహా ఇచ్చింది డీఈవో కార్యాలయమే. ఉపాధ్యాయుల వ్యవహారంలో తలదూర్చి చెడ్డపేరు తెచ్చుకోలేమన్న భావనతోనే చాలామంది ఇటువంటి సిఫార్సులకు దూరంగా ఉంటారు. రాష్ట్రంలో ఉద్యోగులందరి బదిలీలు ఒక పద్ధతిలో జరిగితే, టీచర్ల బదిలీలు మాత్రం ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా జరగడానికి కారణమిదే. ఇందులో రాజకీయ ప్రమేయం ఉంటే వేగంగా డిఫేమ్ అయిపోతామన్న విషయం రాజకీయ నాయకులకు తెలుసు. కానీ ఇప్పుడు అదే రాజకీయ నాయకుల పేరు చెప్పి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు జాబితా సిద్ధం చేసేశారు. సీనియర్ ఉపాధ్యాయులను, అత్యధిక కాంపొనెంట్ పాయింట్లు కలిగి ఉన్నవారిని కాదని నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డులకు ప్రతిపాదనలు రూపొందించారని స్వర్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నియమించిన సెలక్షన్ కమిటీ జిల్లాలో ఉత్తమ ఫలితాలు చూపించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కాంపొనెంట్ పాయింట్లు సాధించిన ఉపాధ్యాయులను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సిఫార్సు చేయాలి. జిల్లా కమిటీ దీనికి భిన్నంగా దాదాపు 25 కాంపొనెంట్ పాయింట్స్ తక్కువగా ఉన్నవారిని అవార్డుకు సిఫార్సు చేసిందని ఫిర్యాదులో కలెక్టర్‌కు వివరించారు. అధికార పార్టీ నాయకులు సూచించారంటూ నచ్చినవారిని జిల్లా విద్యాశాఖ అధికారే నిర్ణయించి కమిటీ ద్వారా సిఫార్సు చేశారని ఆరోపిస్తున్నారు. ఈ విధంగా ఎంపికచేస్తే కమిటీ ఎందుకు ఏర్పాటుచేశారని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

## తమ్మినేని బోగస్ బాగోతంపై విచారణ



- ✔ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో లా కోర్సులో చేరారని ఆరోపణలు
- ✔ రాష్ట్రపతి నుంచి లేఖ వచ్చినా స్పందించని గత ప్రభుత్వం
- ✔ ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీకి వినతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ స్పీకర్, వైకాపా నేత తమ్మినేని సీతారాం విద్యార్హతల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. డిగ్రీ చేయకుండానే బోగస్ సర్టిఫికెట్‌తో న్యాయ కళాశాలలో మూడేళ్ల లా కోర్సులో చేరినట్లు తమ్మినేనిపై ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై గతంలోనే ఫిర్యాదు చేసినా అప్పటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా తూర్పు కాపు సాధికార కమిటీ కన్వీనర్ పల్లి సురేష్ విమర్శించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తమ్మినేని బోగస్ సర్టిఫికెట్ ఉదంతంపై విచారణ జరిపించాలని స్వయంగా రాష్ట్రపతి కార్యాలయం సూచించినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తమ్మినేని సీతారాం ఎటువంటి డిగ్రీ కోర్సులో చేరలేదు. కానీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ చదివి పాసైనట్లు సర్టిఫికెట్లు పుట్టించారు. వాటినే చూపించి ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఉన్న మహాత్మాగాంధీ న్యాయ కళాశాలలో మూడేళ్ల లా డిగ్రీ కోర్సులో అడ్మిషన్ పొందారు. తమ్మినేని నకిలీ డిగ్రీ సర్టిఫికెట్, అక్రమ అడ్మిషన్‌పై 2022 నుంచి పోరాడుతున్నట్లు ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఆయన చూపించిన డిగ్రీ సర్టిఫికెట్‌పై అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆరా తీయగా తమ వద్ద తమ్మినేని డిగ్రీ చేయలేదని, ఆయన పేరుతో తమ సంస్థ డిగ్రీ సర్టిఫికెట్ జారీ చేయలేదని ఆ వర్సిటీ రిజిస్ట్రార్ రాతపూర్వకంగా స్పష్టం చేశారని వెల్లడించారు. ఆ సర్టిఫికెట్‌తోనే ఆయన మహాత్మాగాంధీ లా కళాశాలలో చేరినట్లు ధ్రువీకరిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు ఇచ్చిన లెటర్లను జత చేసి అప్పట్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్‌కు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులతోపాటు భారత రాష్ట్రపతికి కూడా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. అయితే వైకాపా నాయకుడిగా, స్పీకర్ హోదాలో ఉన్న తమ్మినేనిపై వచ్చిన ఫిర్యాదుపై అప్పటి వైకాపా ప్రభుత్వం స్పందించలేదన్నారు. చివరికి ఈ అంశంపై విచారణ జరపాలని సూచిస్తూ రాష్ట్రపతి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినందున మరోసారి ఈ ఉదంతాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తమ లేఖతోపాటు జత చేసిన రాష్ట్రపతి లేఖ, ఓపెన్ వర్సిటీ ఇచ్చిన వివరాలను పూర్తిగా పరిశీలించి తమ్మినేని బోగస్ సర్టిఫికెట్ బాగోతంపై సీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌కు ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. తమ ఫిర్యాదులోని నిజాలను నిగ్గు తేల్చి ఒక బాధ్యాయుతమైన పదవి నిర్వహించినా.. నకిలీ బాగోతానికి పాల్పడిన తమ్మినేని సీతారాంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కూన రవికుమార్, పల్లి సురేష్ సీఎస్‌కు విన్నవించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.